# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 | సంచిక : 158 | మంగళవారం 10, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




# ప్రచారానికి తెర

## రేపు పోలింగ్.. ఏర్పాట్లలో ఈసీ బిజీ

**కోడ్ అమలుపై స్పెషల్ నిఘా**
**అవసరమైన ప్రాంతాల్లో 12న రీ పోలింగ్**
**13న కౌంటింగ్.. ఎప్పటికప్పుడు ఫలితాల వెల్లడి**
**పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ సెంటర్ల వద్ద ఆంక్షలు**
**48 గంటల పాటు అమలులో సైలెన్స్ మోడ్**
**రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్**
**ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్రంలోని 116 మున్సిపాల్టీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరుగుతున్న పురపాలక ఎన్నికల్లో ప్రచార పర్వం ముగిసింది. హోరాహోరీగా కొనసాగిన వివిధ పార్టీల, అభ్యర్థుల ప్రచారానికి సోమవారం సాయంత్రం 5 గంటలకు తెర పడింది. గత నెల 28వ తేదీన ఎన్నికల షెడ్యూల్ జారీ చేసిన నాటి నుంచి టికెట్ల ప్రయత్నాలు, నామినేషన్ల పరిశీలన, విత్ డ్రా వంటి ప్రక్రియలు ముగిసిన తర్వాత రానున్న 48 గంటల పాటు సైలెన్స్ మోడ్ కొనసాగనున్నది. రేపు పోలింగ్, 13న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించేందుకు వీలుగా స్టేట్ ఎలక్షన్ కమిషన్ ..మిగతా 3లో

# మోరీ తీసేందుకు మోదీ వస్తారా?

**గల్లీ ఎన్నికలతో ఆయనకేం సంబంధం?**
**ఒవైసీ పేరు చెప్పి మత రాజకీయాలు ఎన్నాళ్లు?**
**నెల్లూరు పెద్దారెడ్డిలా బండి సంజయ్**
**కిషన్ రెడ్డి వల్ల ఉపయోగం ఏంటి?**
**12 ఏళ్లలో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు తెచ్చారా?**
**రూపాయి కేంద్రానికి ఇస్తే వస్తున్నది 42 పైసలే**
**పైగా మేమే ఇచ్చామని గొప్పలు చెబుతున్నారు**
**మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన నిధులు ఆటోమేటిక్‌గా వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించిన వాటానే తిరిగి రాష్ట్రానికి ఇస్తున్నారన్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.1 ఇస్తే, కేవలం 42 పైసలే తిరిగి వస్తున్నదని చెప్పారు. కర్ణాటకకు 16 పైసలు, తమిళనాడుకు 26 పైసలు ఇస్తున్నట్లు వివరించారు. కేరళకూ 49 పైసలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీరని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రాలకు రావాల్సిన వాటా ఇవ్వకుండా కేంద్రం అన్యాయం చేస్తున్నదన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో బిహార్‌కు రూ.6.06 ఇస్తున్నట్లు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు రూ.2.09, యూపీకి రూ.2.90 ఇవ్వడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి దీనిపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ వివక్షపై మోదీని ప్రశ్నించాల్సిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నట్లు మండిపడ్డారు. సోమవారం సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ ..మిగతా 3లో

# రెడ్డి అయినా, రావు అయినా మా దగ్గరకు రావాల్సిందే.!

**MIM నేత అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు**
**సీఎం దగ్గరకి మేం వెళ్లం.. సీఎంలే మా దగ్గరకి వస్తారు**
**జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మా మద్దతు లేనిదే కాంగ్రెస్ గెలిచిందా.?**
**రెడ్డి అయినా, రావు అయినా.. మా దగ్గరికి రావాల్సిందే**
**మున్సిపల్ ఎన్నికల్లో MIM సత్తా ఏంటో చూపిస్తాం. -అక్బరుద్దీన్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎంఐఎం స్టార్ క్యాంపెయినర్ అక్బరుద్దీన్ ఓవైసీ కరీంనగర్ వేదికగా తనదైన శైలిలో విమర్శల గళం విప్పారు. గత అసెంబ్లీ ..మిగతా 2లో

# జూబ్లీహిల్స్‌లో గెలిచింది మేమే.. ఎవరి మద్దతోనో కాదు..

**అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు ఘాటు స్పందన**
**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సొంత బలంతోనే విజయం**
**సుపరిపాలనే ప్రజల మద్దతుకు కారణమని వ్యాఖ్య**
**ఎంఐఎం రాజకీయ ఉనికి కోసమే ఇలాంటి మాటలని విమర్శ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ముగిసిన తరుణంలో అధికార కాంగ్రెస్, ఎంఐఎం మధ్య మాటల యుద్ధం ముదిరింది. "ముఖ్యమంత్రులే ..మిగతా 2లో

## అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా
# ఎవరూ మాట్లాడలేదు

**రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదన్న కేటీఆర్**
**కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక**
**రెండేళ్ల తర్వాత పాతాళంలో దాక్కున్నా ఊరుకునేదని వ్యాఖ్య**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ..మిగతా 2లో

# రేవంత్ రెడ్డి జైలుకు పోయే టైం దగ్గరకొచ్చింది

**ఆయన ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ**
**సాక్ష్యాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను తగలబెట్టేందు**
**ప్రమాదవశాత్తు జరిగిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నడు**
**మాజీ మంత్రి హరీష్ రావు**

02



# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!

**లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు**
**ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం**
**8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి**
**రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదని ఆగ్రహం**

02



# ముగిసిన చివరి స్టాండింగ్ కమిటీ భేటీ

**కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో అనేక కార్యక్రమాలు చేపట్టామన్న మేయర్**
**మేయర్ పదవీ కాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని సన్మానించిన అధికారులు, కార్పొరేటర్లు**
**కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్న జీహెచ్ఎంసీ కమిషనర్**

02





# తెలంగాణలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి

**రేవంత్ సర్కార్ పై విమర్శలు గుప్పించిన అరుణ**
**మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నులు పెంచేందుకు సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపణ**
**మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించానని వెల్లడి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మహిళలపై ..మిగతా 2లో


www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

## అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా
# ఎవరూ మాట్లాడలేదు

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్యమంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు.

భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు.

సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.



## రేవంత్ రెడ్డి జైలుకు పోయే టైం దగ్గరకొచ్చింది

- **ఆయన ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ**
- **సాక్ష్యాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను తగలబెట్టిండు**
- **ప్రమాదవశాత్తు జరిగిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నడు**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

సీఎం రేవంత్ రెడ్డికి జైలుకు వెళ్లే సమయం దగ్గరపడిందని మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ కు శిక్షపడక తప్పదన్నారు. శిక్ష నుంచి తప్పించుకునేందుకు ఆయన నానా తంటాలు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగా ఆ కేసులో విచారణ ఫైళ్లు ఉన్న నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ ను తగలబెట్టించారని ఆరోపించారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రమాదవశాత్తు జరిగిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్న హరీశ్ రావు.... 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంతతుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ఠ కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేదని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు.ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సస్యశ్యామలంగా, పాడిపంటలతో సుభిక్షంగా, చల్లగా ఉండేవారని, రేవంత్ సర్కారులు నీటి కష్టాలు, కన్నీటి బాధలు గ్రామాలను ముంచెత్తుతున్నాయని విమర్శించారు.



# జూబ్లీహిల్స్‌లో గెలిచింది మేమే.. ఎవరి మద్దతోనో కాదు..

మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్‌లో గెలిచింది మేమే.. ఎవరి మద్దతోనో కాదు..

మా దగ్గరకు రావాలి" అని అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ గెలుపుపై అక్బరుద్దీన్ చేసిన క్లెయిమ్‌ను ఆయన తోసిపుచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం మరొకరి భిక్ష కాదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేసి గెలిచింది. మా పార్టీ నేతలు, కార్యకర్తలు రాత్రింబగళ్లు కష్టపడితేనే ఆ విజయం సాధ్యమైంది" అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రజాదరణను తక్కువ చేసి చూపడం అక్బరుద్దీన్‌కు తగదని ఆయన హితవు పలికారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓటేశారని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా రంజక పాలన చూసి ఓటర్లు పట్టం కట్టారని, తమ గెలుపును మరొకరి ఖాతాలో వేయాలని చూడటం ముమ్మాటికీ పొరపాటని ఆయన వ్యాఖ్యానించారు. తామే గెలిపించామని ఎవరైనా భ్రమల్లో ఉంటే అవి వదిలేసుకోవాలని అక్బరుద్దీన్‌నుద్దేశించి మంత్రి చురకలు అంటించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తమ ఉనికిని చాటుకోవడానికి, ఓటర్లను ఆకర్షించడానికే ఎంఐఎం నేతలు ఇలాంటి అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఇలాంటి వ్యాఖ్యలకు మున్సిపల్ ఎన్నికల్లోనే సరైన సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా తన సత్తా చాటుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి

మొదటిపేజీ తరువాయి

అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆమె మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నులు పెంచేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఖజానాలో చిల్లిగవ్వ లేదని... మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శించారు.

అన్ని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించామని అరుణ తెలిపారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించానని చెప్పారు.

మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్ పూర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరమని అరుణ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పారదర్శక, అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యమని చెప్పారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై దృష్టి సారిస్తామని... కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.



## రెడ్డి అయినా, రావు అయినా
# మా దగ్గరకు రావాల్సిందే.!

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ఫలితాలను గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం కింగ్ మేకర్‌గా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రుల గురించి ప్రస్తావిస్తూ అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "మేము ముఖ్యమంత్రుల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదు. పనులు కావాలన్నా, అధికారం కావాలన్నా ముఖ్యమంత్రులే మా దగ్గరకు రావాల్సి ఉంటుంది. అది రెడ్డి అయినా, రావు అయినా ఎవరైనా సరే.. మా మద్దతు లేకుండా రాజకీయం చేయడం సాధ్యం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎంఐఎం మద్దతు అనేది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమకుందని ఆయన పేర్కొన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును అక్బరుద్దీన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. "జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎంఐఎం మద్దతు లేనిదే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారా?" అని ఆయన ప్రశ్నించారు. అక్కడ కాంగ్రెస్‌కు వచ్చిన విజయంలో ఎంఐఎం పాత్ర కీలకమని, ఆ విషయాన్ని వారు మర్చిపోకూడదని పరోక్షంగా హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి తమ అవసరం ఎప్పుడూ ఉంటుందనే సంకేతాలను ఆయన ఈ వ్యాఖ్యల ద్వారా పంపారు.


వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం అద్భుతమైన ప్రతిభ కనబరుస్తుందని అక్బరుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలు , కార్పొరేషన్లలో తమ పార్టీ బలం ఏంటో ప్రత్యర్థులకు చూపిస్తామని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి, అత్యధిక వార్డులను గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.



## 11వ వార్డ్ అభివృద్ధి కోసం
# గంజి శ్రీవాణి గెలిపించండి

**వలిగొండ,ఫిబ్రవరి 9(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రం ని మున్సిపల్ ఎలక్షన్స్ సందర్భంగా II వ వార్డు కాం పార్టీ బలపరిచిన అభ్యర్థి గంజి శ్రీవాణి గణేష్‌రెడ్డి చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ గెలిపించాలని ప్రచారంలో భాగంగా సోమవా రోజున ప్రతి ఓటర్ ను కలిసి మన భువనగిరి ఎమె కుంభంఅనిల్ కుమార్ రెడ్డి సహకారంతో II వ వా లో ఉన్న సమస్యలను సస్యశ్యామలం చేస్తానని గతం కూడా మా కుటుంబ సభ్యుల స్కూల్ ప్రహరీ గోడ స్మశాన వాటికలో, ఆంజనేయ స్వామి దేవస్థానం, గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లకు పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేశా అని అన్నారు ఈ కార్యక్రమంలో II వ వార్డు ఇన్చార్జి జక్క జంగారెడ్డి, చిలుగురి సత్తిరెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు బండి నరె గంజిఅంజిరెడ్డి,బద్దంబుచ్చిరెడ్డి, ఉక్కుర్తి స్వామి,నర్సింగ్ యాదవ్, చిలుకూరి వెంకటరెడ్డి,యూత్ అధ్యక్షులు బండి గోపా మొగిలినర్సిరెడ్డి,కౌకుంట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన చివరి స్టాండింగ్ కమిటీ భేటీ




- **కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో అనేక కార్యక్రమాలు చేపట్టామన్న మేయర్**
- **మేయర్ పదవీ కాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని సన్మానించిన అధికారులు, కార్పొరేటర్లు**
- **కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్న జీహెచ్ఎంసీ కమిషనర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. అజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తన పదవీ కాలంలో కమిషనర్, అధికారులు ఎంతో సహకారం అందించారని, ఇది మరిచిపోలేనని అన్నారు. మేయర్ పదవీ కాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు. కాగా, ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం నివేదికను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందించింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ అన్నారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామని అన్నారు.

# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!


- **లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు**
- **ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం**
- **8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి**
- **రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదని ఆగ్రహం**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు.

ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి.

2020లో భారత్‌చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.





# ప్రచారానికి తెర

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాట్లు చేస్తున్నది.

**పకడ్బందీగా కోడ్ అమలు**

ఎన్నికల ప్రక్రియలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా, ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసి, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లలో ఎలక్షన్ కమిషన్ నిమగ్నమైంది. పోలింగ్ రోజున ఇప్పటికే సర్కారు సెలవు ప్రకటించింది. పోలింగ్ జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించిన ఎన్నికల కమిషన్, అక్కడ భారీ బందోబస్తును చేపట్టేందుకు వ్యూహం సిద్ధం చేసింది. పోలింగ్ ముగిసిన తర్వాత అవసరమైన చోట 12న రీ పోలింగ్ నిర్వహించేందుకు కూడా కమిషన్ ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. 137 స్ట్రాంగ్ రూమ్‌లలో 16,031 బ్యాలెట్ బాక్సులను భద్రపరిచి, 13న 136 కౌంటింగ్ సెంటర్లలో ఉదయం 8 గంటల నుంచి ఓట్ల కౌంటింగ్ ప్రక్రియను చేపట్టి, ఎప్పటికప్పుడు ఫలితాలను వెల్లడించేలా ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది.

**2,996 వార్డులు.. 8,203 పోలింగ్ స్టేషన్లు**

116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో మొత్తం 2,996 వార్డులున్నట్లు, వీటిలో ఇటీవలే ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం బీసీ (జనరల్) 463, బీసీ (మహిళ) 391, ఎస్సీ(జనరల్) 254, ఎస్సీ (మహిళ) 190, ఎస్టీ జనరల్ (147), ఎస్టీ (మహిళ) 40, అన్ రిజర్వ్‌డ్ (జనరల్) గా 647, అన్ రిజర్వ్‌డ్ (మహిళ) 864గా కేటాయించి ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. 8,203 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 26.80 లక్షల మంది కాగా, పురుష ఓటర్లు 25.62 లక్షల మంది ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది.

**పకడ్బందీగా కోడ్ అమలు**

సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వచ్చిన 48 గంటల సైలెన్స్ మోడ్‌తో పాటు మొత్తం ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ఎలక్షన్ కమిషన్ 742 మంది జోనల్ ఆఫీసర్లను నియమించింది. వీరిలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లో 279 మంది, స్టాటిటిక్ సర్వైలెన్స్ టీమ్‌లో 381 మందిని నియమించి, ప్రత్యక బృందాలుగా రౌండ్ ది క్లాక్ నిఘాను ముమ్మరం చేసింది. దీంతో పాటు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు కూడా నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా మొత్తం 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించగా, మరో 1,547 మందిని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను, మరో 9,560 మందిని ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా, 31,428 మందిని అదర్ పోలింగ్ ఆఫీసర్లుగా నియమించింది. పురపాలక ఎన్నికల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.రెండున్నర కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలింగ్ ముగిసే వరకు అమలులో ఉన్న సైలెన్స్ మోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు విధి నిర్వహణలో ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది.

**14న చైర్ పర్సన్స్, వైస్ చైర్ పర్సన్స్ ఎన్నిక**

13న కౌంటింగ్ ముగిసిన తర్వాత 14న మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక, పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12.3 గంటలకు అన్ని సంస్థల్లో స్పెషల్ మీటింగ్ లను నిర్వహించనున్నారు. దీంతో పాటు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని ప్రజాప్రతినిధులను ఎక్స్‌అఫీషియో సభ్యులకు పరోక్ష ఎన్నికను కూడా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 14వ తేదీలోపు ప్రజాప్రతినిధుల వివరాలను సమర్పించాలని ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

# మోరీ తీసేందుకు మోదీ వస్తారా?

**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాష్ట్రానికి ఏం తెచ్చారు?**

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టినట్లుగా మాట్లాడడం కేంద్ర మంత్రులకు న్యాయమా అంటూ సీఎం మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం విచక్షణా అధికారంతో తెలంగాణకు ఏ ఒక్కటీ ఇవ్వలేదని ఆరోపించారు. "ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. మూసీకి అదనంగా గ్రాంటు తీసుకురాలేదు. మెట్రోకూ నిధులు ఇవ్వలేదు. సమ్మక్క సారక్క జాతరకు ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్‌ను, సెమీ కండక్టర్ ప్రాజెక్టులను రాకుండా చేశారు" అని ఫైరయ్యారు. 12 ఏళ్లలో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమైనా నిధులు తెచ్చారా అని కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను నిలదీశారు. కనీసం బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు కూడా నిధులు తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వరదల సమయంలోనూ అదనంగా నిధులు ఇవ్వలేదన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టు భూసేకరణ నిధులు కూడా రాష్ట్రం నుంచే చెల్లించామని చెప్పారు. "గల్లీ ఎలక్షన్‌కు మోదీకి ఏం సంబంధం. ఆయన వచ్చి మోరీ తీస్తారా" అంటూ ప్రశ్నించారు. ఓట్లు వేయించుకోవడం, సీట్లు తెచ్చుకోవడం తప్ప, బీజేపీ తెలంగాణకు ఇచ్చిందేమీ లేదన్నారు.

**మత రాజకీయాలు ఎన్నాళ్లు?**

బీజేపీ అసదుద్దీన్ ఒవైసీని భూతంగా చూపి ఎంతకాలం మత రాజకీయాలు చేస్తుందని రేవంత్ నిలదీశారు. రాజకీయ మనుగడ కోసం మత విద్వేషాలు రెచ్చగొట్టడం మంచిది కాదని సూచించారు. 12 ఏళ్లుగా కేంద్రంలో మోదీ అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేంటని ప్రశ్నించారు. 2014లో పాలమూరు సభలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని చెప్పారని, కానీ ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఆదిలాబాద్‌కు ప్రచారానికి వచ్చి, రాష్ట్రానికి సహరిస్తామని ప్రకటిస్తారనుకున్నామని, కానీ పొలిటికల్ విమర్శలు చేసి వెళ్లిపోయారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు 2 లక్షల సాగునీరు, తాగునీరు అందించే ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేసేందుకు సహకరించాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణను అవమానించినట్లు ఫడ్నవీస్ మాట్లాడరన్నారు. హైదరాబాద్ వరదల సమయంలో ముంపునకు గురైన సందర్భంలో కారుకు కారు, బైకుకు బైకు ఇస్తామని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రచారం చేశారని, ఆ తర్వాత చేతులెత్తేశారన్నారు. కిషన్ రెడ్డి కూడా గతంలో ఆ హామీలకు ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. ఆ మాట నమ్మి జీహెచ్ఎంసీలోని ప్రజలు బీజేపీకి కూడా సీట్లు వచ్చేందుకు సహకరించారన్నారు. సత్రం భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి రికమెండేషన్ ఇచ్చినట్లు బండి సంజయ్ తీరు ఉన్నదన్నారు. ప్రజలు హామీల గురించి అడిగితే ఇన్సూరెన్స్ ఉన్నదనే విషయం చెప్పారని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి ఏ మంత్రి వచ్చినా లక్షల కోట్లు మంజూరు చేస్తామని చెప్పి మోసం చేస్తున్నారన్నారు.

**బీఆర్ఎస్‌ను యాసిడ్‌తో కడగాలి**

తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నదని కానీ రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సర్పంచ్ నుంచి మున్సిపల్ వరకు పెత్తనం చెలాయించి దోచుకున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్, బీజేపీ వలన తెలంగాణకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు ఎందుకు ఓటేయాలి అంటూ ప్రశ్నించారు. కళ్ల ముందు గతం, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రజలు తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుత సమస్యలకు ప్రధాన కారణం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కాదా అని నిలదీశారు. అహంకారం, విద్వేష ప్రసంగాలతో గంజాయి, కొకైన్ తీసుకున్న వారిలా మాట్లాడే వాళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. దోపిడీకి అలవాటు పడ్డ ఇలాంటి వాళ్లకి ఓటు వేస్తే ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఒక ఉన్మాదంతో మానసిక రోగంతో ఫోన్ ట్యాపింగ్ ద్వారా వందల కోట్లు వసూలు చేశారన్నారు. విచారణకు పిలిస్తే



ముసుగు తొడుక్కుని వెళ్లకుండా బరి తెగించి ఏదో యుద్ధానికి వెళ్లినట్టు వెళ్లడం సిగ్గుచేటన్నారు. మూడోసారి మళ్లీ ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లది 2023 వరకు విడదీయలేని అనుబంధం అంటూ గుర్తు చేశారు. నోట్ల రద్దు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, త్రిపుల్ తలాక్‌కు మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. అందుకే ఇప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అరెస్ట్ కాకుండా బీజేపీ కాపాడుతున్నదన్నారు. బీఆర్ఎస్‌ను యాసిడ్ పోసి కడిగితే తప్ప రాష్ట్రానికి పట్టిన పీడ వదలదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జైలుకు వెళ్లాలని కవిత, హరీశ్, కేటీఆర్‌లు తాపత్రయం పడుతున్నట్లు వ్యాఖ్యానించారు. ఎవరు జైలుకు వెళ్తే, వాళ్లు సీఎం అవుతారనే భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇంటి ఆడబిడ్డను మంచిగా చూసుకుంటే కేసీఆర్ కుటుంబంలో ఈ సమస్యలు వచ్చేవి కావన్నారు. పదేళ్ల పాటు వాళ్లంతా కలిసి సంపాదించి, పంపకాల్లో తేడా వచ్చి రోడ్డుపైకి వచ్చి కొట్టుకుంటున్నారని తెలిపారు.

**ఫస్ట్ కే జీతాలు**

తాము అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు మొదటి తారీఖునే వచ్చేలా చేస్తున్నామని సీఎం తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చామన్నారు. రేషన్ కార్డులు అందించి పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. మహిళల ఉచిత ప్రయాణం, సన్నాలకు రూ.500 బోనస్, పేదల నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు, 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. వందేళ్లలో ఎప్పుడూ లేని విధంగా బీసీ కులగణన చేసి చూపించామన్నారు. 40 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని గుర్తు చేశారు.

12 ఏళ్ల మోదీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. మరోవైపు, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌తో రాష్ట్రానికి నష్టమే అని సీఎం చిట్ చాట్‌లో చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అని వెల్లడించారు. అతను 20 నెలలుగా విదేశాల్లో ఉన్నట్లు చెప్పారు. భారత్‌కు తీసుకురావడానికి కేంద్రం సహకరించలేదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావును భారత్‌కు తీసుకొచ్చామన్నారు. అతను వచ్చాకే విచారణ వేగవంతం అయ్యిందని చెప్పారు. సీబీఐ విచారణ చేయబోమని తిరస్కరిస్తే, స్టేట్ ప్రత్యేక యాక్షన్ తీసుకునేందుకు రెడీ అవుతుందన్నారు. ఇక ప్రస్తుతానికి జిల్లాల పునర్వ్యవస్థీకరణ లేదన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ఏపీ అంశమని, కానీ మన రాష్ట్రంలోని ఆలయాల్లో విజయ డెయిరీ నెయ్యి వాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ తోనే అభివృద్ధి....

- **ప్రజల మద్దతు మాకు ఉంది....**

**మెదక్ ఫిబ్రవరి 09 (ప్రజా స్వరం)**


మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చివరి రోజు మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 4 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నర్మదా తరపున కుమారుడు శ్రీధర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ తుమ్మన్నగారి అనిల్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ కి ఓటు వేసి అభివృద్ధి సాధ్యమని అన్నారు. వార్డు ప్రజల మద్దతు మాకు ఉందని ఇంటింటికి వెళ్లిన మాకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.

# చివరి రోజు జోరుగా ప్రచారం....

- **అభివృద్ధి కి ఓటు వేసి ఆదరించండి....**

**మెదక్ ఫిబ్రవరి 09 (ప్రజా స్వరం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఝాన్సీ ఇస్సాక్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజా సేవలో ఉంటున్నానని అన్నారు. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీ కి ఉందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేస్తున్న అభివృద్ధి చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ నీ అభ్యర్థి గా ఉన్న నాపై నమ్మకం ఉంచాడని అన్నారు. కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



# అంగన్వాడిలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించిన సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్....

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 9 (ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్ హాజరయ్యారు, ఈ సందర్భంగా సర్పంచ్ సబిత రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, పిల్లలు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు, అనంతరం బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్ ఉప సర్పంచ్ రాజు సాగర్. ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ అంగన్వాడి టీచర్ సుశీల, లక్ష్మి, స్వప్న, రేణుక, స్వాతి, ఆశా వర్కర్ భాగ్యా, అజ్మీరి, ఏఎన్ఎం వందన, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు



# ఆదిలాబాద్‌లో ఘనంగా PRTU TS ఆవిర్భావ దినోత్సవం

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 09 (ప్రజాస్వరం):-**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో PRTU TS (ప్రోగ్రెసివ్ రెకగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ - తెలంగాణ రాష్ట్రం) ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాలల పరిరక్షణే సంఘ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంఘ నిర్మాణం బలంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయుల సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం, విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం PRTU TS నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు.


PRTU TS ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వృద్ధాశ్రమంలో భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి. నరసింహా స్వామి, గౌరవాధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి.. ఎస్సై సృజన

**నార్సింగి, ఫిబ్రవరి 09 (ప్రజా స్వరం)**



చేపల వేటకు మిత్రులతో వెళ్ళిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధి శంఖాపూర్ గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం శంఖాపూర్ గ్రామానికి చెందిన బైకరి రమేష్ (26) తండ్రి కొమరయ్య, కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రమేష్ సోమవారం ఉ. దాదాపు 11 గం లకు తన ఇద్దరు మిత్రులతో చేపల వేట కోసం శంఖాపూర్ లోని మైసమ్మ చెరువుకు వెళ్ళాడు. వేట సమయంలో దాదాపు 12 గం లకు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి గల్లంతయ్యాడు. రమేష్ తో వేటకు వెళ్ళిన వారు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సృజన సిబ్బందితో పాటు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయం తో రమేష్ కోసం చెరువులో వెతకడం ప్రారంభించారు. అలాగే రామాయంపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారాన్ని అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు దాదాపు రెండు గంటలు శ్రమించిన అనంతరం రమేష్ మృత దేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు.



# ప్రజలు మాయమాటలు నమ్మొద్దు.....

- పదేళ్లలో ఏ గ్రామంలో ఇల్లు నిర్మించలే.....
- అన్ని సర్వేల్లో మెదక్ మున్సిపాలిటీ 29 సీట్లు.....
- ప్రజాపాలన లోనే మెదక్ అభివృద్ధి......
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్......

మెదక్ ఫిబ్రవరి 09 (ప్రజా స్వరం)

ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజలకు అభివృద్ధి సంక్షేమం పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్ లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ పదేళ్లు బిఆర్ఎస్ నాయకులు ఏమి చేయలేదని, పదేళ్లు పీకలేనోళ్ళు ఇప్పుడు ఎందుకు వస్తున్నారని ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం లోనే అభివృద్ధి సాధ్యమని, అప్పట్లో కాంగ్రెస్ హయాంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు తప్ప వేరే ఏ ప్రభుత్వం గ్రామాల్లో ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. మన అభ్యర్థులు గెలిస్తేనే మెదక్ పట్టణంలో అభివృద్ధి లో ముందుకు వెళ్తుందని అన్నారు. మనల్ని మోసం చేయనికి మళ్ళీ కొంత మంది ఓట్ల కోసం మాయ మాటలు చెబుతారు వారి మాయలో పడొద్దని అన్నారు. సొంత కూతురే కెసిఆర్ అవినీతి చేశారని చెబుతుందని, అలాంటి వారిని నమ్మడం ప్రజలు ఎలా నమ్ముతారని అన్నారు. మన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నామనీ, రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తున్న ఘనత మన ప్రభుత్వానిదే అన్నారు. బిఆర్ఎస్ నాయకులు పైసలు పంచితే తీసుకోవాలని, ఓటు మాత్రం చేయి గుర్తుకు వేయాలని అన్నారు. అవి అన్ని కూడా బి ఆర్ ఎస్ వాళ్లు పదేళ్లు మన దగ్గర దోచుకున్న పైసలే అన్నారు. నాకు ఎలాంటి కులం లేదని, నేను మీ బిడ్డను మీ బిడ్డ మొఖం చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి ఎంటో చూపిస్తా అన్నారు. మెదక్ మున్సిపాలిటీ లో ఏ సర్వే రిపోర్ట్ చూసినా 29 సీట్లు గెలుస్తుందనీ, బిఆర్ఎస్ ఖేల్ ఖతం దుకాణం బంద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి ముందుకు సాగుతుందని అన్నారు. మెదక్ మున్సిపాలిటీ మీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పటిష్టమైన క్యాడర్ ఉన్నారని పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు. మన నిధులు హరీష్ రావు తీసుకుపోయి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల కు తరలించ్చిండ్రు అన్నారు. మెదక్ లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నదని, మళ్లీ ప్రజలు తప్పుదారి పట్టి వేరే వారికి మున్సిపల్ ఓటు వేస్తే అభివృద్ధి కి ఆటంకం కలుగుతుందని అన్నారు. బి ఆర్ ఎస్ అధికారంలోకి వస్తె దళితులకు మూడేకరాల భూమి ఇస్తానని మోసం చేశారని అన్నారు. మేము అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. దళితున్ని సీఎం చేస్తామని, దళిత బంధు, బిసి బంధు ఇలాంటి మాయ మాటలు చెప్పి పదేళ్లు అధికారంలో ఉన్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ గ్రామంలో ఒక్క ఇల్లు ఇవ్వలేదని మళ్లీ మేము వచ్చాకే ఇచ్చామని అన్నారు. గత పదేళ్లలో మెదక్ నియోజకవర్గం లో 200 కోట్ల పని చేయలేదని, తాము రెండేళ్లలో రెండు వేల కోట్లు నియోజకవర్గం లో అభివృద్ధి చేస్తున్నామని, అందులో కొన్ని పనులు ప్రారంభించామని, మరి కొన్ని పనులను ఎన్నికల అనంతరం చేస్తామని అన్నారు. తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు శంకరంపేట కు ఫ్యాక్టరీలు తెచ్చామని అన్నారు. ఏడుపాయల అభివృద్ధి కి సీఎం రేవంత్ 35 కోట్లు, మెదక్ చర్చి కు సుమారు 30 కోట్ల అభివృద్ధి కోసం నిధులను ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వంలో 100 కోట్లు ఇచ్చామని అవన్నీ పేపర్ కే పరిమితమయ్యాయనీ అన్నారు. 200 కోట్ల తో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కి హరీష్ రావు అడ్డు పడుతున్నారాని అలాంటి వ్యక్తిని మన ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. రానున్న రెండు నెలల్లో కొత్త పెన్షన్లు సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు. మెదక్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం అయ్యాక 500 ఇళ్లు మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పినట్లు తెలిపారు.



# పేకాట పై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు....

- పేకాట ఆడుతున్న 3 గురు అరెస్ట్....
- 13,400 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం....
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు....

మెదక్ ఫిబ్రవరి 09 (ప్రజా స్వరం)

పాపన్నపేట్ మండలం పరిధిలోని అబ్దులపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించి 3 గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అబ్దులపూర్ అటవీ ప్రాంతం లో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి చేశారు. ఈ దాడిలో 3 గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ13,400 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి చర్యల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పు మార్గాలు ఎంచుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



# సీఎం కప్–2026 ఖోఖోలో దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 9 (ప్రజాస్వరం):

దుబ్బాక నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్-2026 క్రీడా పోటీల్లో దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ స్థానాన్ని సాధించారు. దుబ్బాకలో జరిగిన ఈ పోటీల్లో ఖోఖో బాలుర విభాగంలో పాల్గొన్న దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల జట్టు విజయం సాధించి అందరి ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన పీడీ సురేష్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



# ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- మీడియా సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ

ప్రజా స్వరం, భద్రాద్రి కొత్తగూడెం:

ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ హెచ్చరించారు. సోమవారం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ తేదీన జరగబోయే ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని 33 డివిజన్లలో 34,000 వేల రూపాయల విలువగల 40 లీటర్ల మద్యాన్ని, 2,70,000 వేల రూపాయల విలువ గల 5.5 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టర్ను ఉల్లంఘించినందుకు గాను మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని,110 కేసుల్లో 258 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందని వివరించారు. 33 డివిజన్లలోని 41 పోలింగ్ స్థానాలలో 110 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 65 పోలింగ్ కేంద్రాలు సున్నితమైనవిగా, 45 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా మద్యం నగదు ఇతరత్రా వస్తువులను సరఫరా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విగాథం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మూడు టౌన్ల పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్బీఐ ఫైనాన్షియల్ లిటరసీ వీక్–2026 పోస్టర్ ఆవిష్కరణ

- గ్రామస్థాయి వరకు ఆర్థిక అవగాహన విస్తరణే లక్ష్యం
- అడిషనల్ కలెక్టర్ పాండు

సంగారెడ్డి, ఫిబ్రవరి 09 ప్రజా స్వరం:–



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 09 నుంచి 13 వరకు నిర్వహించనున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్-2026 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "KYC - Your First Step to Safe Banking" అనే అంశంపై ఈ ఏడాది ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో కేవైసీ ( Know Your Customer ) నిబంధనలపై అవగాహన పెంపొందించడం, సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీ (CKYC) ప్రాముఖ్యత, ఖాతా భద్రత, KYC కు సంబంధించిన మోసాల నివారణ, మనీ మ్యూలింగ్ వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక అవగాహన మరింత విస్తృతంగా చేరేలా గ్రామ సభలు, అవగాహన శిబిరాలు, సమావేశాల ద్వారా బ్యాంకులు, సంబంధిత శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఆర్ఎల్ఎం పరిధిలోని స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల ద్వారా విస్తృత స్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు.

అలాగే పట్టణ ప్రాంతాల్లో పట్టణ స్వయం సహాయక సంఘాలు, వార్డు స్థాయి సంఘాల సమావేశాల ద్వారా ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలకు ప్రచారానికి బ్రేక్.

- **జిల్లాలో 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమలు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి.**



**వనపర్తి,ఫిబ్రవరి 9 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎలాంటి ఎన్నికల ప్రచారానికి అవకాశం లేదని, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల తరపున ప్రచారానికి వచ్చిన ఇతర ప్రాంతాల వారు వెంటనే సంబంధిత మున్సిపాలిటీ పరిధులను విడిచి వెళ్లాలని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుందని, ఇంటింటి ప్రచారం గానీ, మీడియా ద్వారా ప్రచారం గానీ నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై తెలంగాణ మున్సిపల్ యాక్ట్-2019 లోని సెక్షన్ 209(2) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మొబైల్ ఫోన్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తే సెక్షన్ 209(1)(b) ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. సైలెన్స్ పీరియడ్ సమయంలో బహిరంగ సభలు, ప్రసంగాలు, హోటళ్లు, హాళ్లలో సమావేశాలు, సంగీత కార్యక్రమాలు, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఏ విధమైన కార్యకలాపాలపై పూర్తి స్థాయి నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల నుండి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, గుంపులుగా చేరడం నిషేధమన్నారు. ఓటర్లు ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు ఓటర్ స్లిప్‌తో పాటు ఎన్నికల కమిషన్ గుర్తించిన 17 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకువెళ్లాలని సూచించారు. పోలింగ్ ప్రాంతాల్లోని హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లు తదితర పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో మద్యం అమ్మకం లేదా పంపిణీ పూర్తిగా నిషేధమని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అన్ని మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ రోజు అయిన ఫిబ్రవరి 13న కూడా మద్యం దుకాణాలు బంద్ చేయాలని తెలిపారు. ఈ కాలంలో ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించేందుకు అనుమతి ఉండదని, అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీలు మీడియా సమావేశాలు, ఇంటర్వ్యూల ద్వారా ఎన్నికల అంశాలపై మాట్లాడేందుకు వీల్లేదన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ఎగ్జిట్ పోల్స్ లేదా ఇతర పోలింగ్ సర్వే ఫలితాలతో సహా ఎలాంటి ఎన్నికల విషయాలను ఎలక్ట్రానిక్ మీడియా లేదా ఇతర మాధ్యమాల్లో ప్రచురించడం, ప్రసారం చేయడం నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

# పిడికిలి ఎత్తి గర్జించిన గులాబీ దండు

- **గులాబీమయయంగా మారిన గణేష్ నగర్ కాలనీ**
- **02 వార్డు అభ్యర్థి బిసొళ్ళ సంధ్యారాణి శ్రీధర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి**
- **ఓటర్ల నుంచి అపూర్వ స్పందన**

**శంకర్ పల్లి ఫిబ్రవరి 09(ప్రజాస్వరం):**

గత బీఆర్ఎస్ పాలనలో శంకర్ పల్లి మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని, మేము చేసిన అభివృద్ధి మీ కండ్ల ముందు కనిపిస్తుందని, మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థులను మంచి మనస్సుతో ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం మున్సిపాలిటీలోని 2వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి బిసొళ్ళ సంధ్యారాణి శ్రీధర్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ వేసవికాలం వచ్చిందంటే మంచినీళ్ల కోసం అల్లాడిన ప్రజలకు ఇంటింటికి మంచినీళ్లనిచ్చి, మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని, కాలనీలలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులను పూరిస్తాయిలో పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేశామని వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పరితపిస్తూ పని చేసే నాయకత్వం బీఆర్ఎస్ పార్టీలో ఉందని, చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 2వ వార్డులో బీఆర్ఎస్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు కోరారు. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో బీఆర్ఎస్ పార్టీనే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్దలు గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.









# బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌కు భారీ స్పందన.





- **అంబేద్కర్ చౌరస్తాలో వేలాదిగా హాజరైన కార్యకర్తలు.**

**వనపర్తి,ఫిబ్రవరి 9 (ప్రజాస్వరం):**



మున్సిపల్ ఎన్నికల చివరి రోజు సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కార్నర్ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ శాసన మండలి ఛైర్మన్ స్వామి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేలాది మంది కార్యకర్తలు, మహిళలు, అన్ని వాడాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభకు ఉత్సాహభరిత స్పందన తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌కు చెందిన 31 మంది అభ్యర్థులు, ఇద్దరు సీపీఐఎం అభ్యర్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనను గుర్తుచేసిన నిరంజన్ రెడ్డి.

ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలంగాణ సాధనతో పాటు అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణకు ముందు కేవలం 14 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, కేసీఆర్ పాలనలో కోటి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని తెలిపారు. విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పరిశ్రమల స్థాపనతో 16 లక్షల ఉద్యోగాలు, ఐటీ రంగం ద్వారా మరో 19 లక్షల ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. రైతుబంధు పథకం కింద 11 సార్లు రూ.72,500 కోట్లను రైతులకు సకాలంలో అందించామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు.

అభివృద్ధే నిరంజన్ రెడ్డి గుర్తింపు.. స్వామి గౌడ్

మాజీ శాసన మండలి ఛైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి గణనీయంగా జరిగిందన్నారు. చెరువుల పునర్నిర్మాణంతో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపారని తెలిపారు. జిల్లా ఏర్పాటు వల్ల కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు 55 రకాల ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడి సుమారు 10 వేల మందికి ఉపాధి లభించిందన్నారు. టౌన్ హాల్, సమీకృత మార్కెట్ సముదాయం, మహిళా వ్యవసాయ కళాశాల, వే సైడ్ మార్కెట్ వంటి అభివృద్ధి పనులు నిరంజన్ రెడ్డి హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. కేసీఆర్ సుపరిపాలన, నిరంజన్ రెడ్డి ప్రజాపాలన కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఐజ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ

- **వేలాది మందిగా హాజరైన జనం**
- **ఐజ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం కాంగ్రెస్ పార్టీదే అంటున్న సంపత్ కుమార్ఐ**
- **జ రూపురేఖలు మార్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే చదువుకున్నవారు స్వచ్ఛమైన మనసున్న వారు నిజాయితీపరులు మా అభ్యర్థులు.**
- **అయితే పట్టణం నాకు పుట్టినిల్లు వంటిది దీని శ్రేయస్సు కొరకు ఎంత దాకైనా పోతా అవసరమైతే ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని దింపుతా.**
- **ఐజ మున్సిపాలిటీని అభివృద్ధి చేసి తీరుతా**
- **ఒక్క అవకాశాన్ని ఇచ్చి చూడండి.**
- **ఐజ పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా.**

**ఐజ మున్సిపాలిటీ,ఫిబ్రవరి 09(ప్రజాస్వరం):**

జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీలో ఈరోజు ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ చేపట్టింది. ఈసందర్భంగాసంపత్‌కుమార్‌మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం అయిజ పట్టణాన్ని అభివృద్ధికి దూరం చేసింది అని ఐజ వ్యాపారస్తుల వద్ద మామూలు వసూలు చేసిందని దొంగలు దోపిడీదారులు కలిసి ఐజా పట్టణాన్ని విచ్చలవిడిగా నాశనం చేశారని అన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం అయిదు పట్టణ అభివృద్ధి కొరకు 15 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని వెంటనే మరొక ఐదు కోట్ల రూపాయలను కూడా మంజూరు చేసిందని మొత్తం 20 కోట్ల రూపాయలను ఐజా పట్టణానికి కేటాయించి వైజాగ్ అత్యంత సుందరంగా మరియు అత్యంత అతిపెద్ద వ్యాపార కేంద్రంగా మార్చడానికి కాంగ్రెస్ పార్టీ పూనుకుందని సంపత్ కుమార్ అన్నారు. ఐజ పట్టణంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నటువంటి అభ్యర్థులు ఎవరు కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదని మచ్చ లేనివారు అని చదువుకున్న వారు అని వారికి ఓటు వేస్తే ఐజా పట్టణ అభివృద్ధి అత్యంత సులువుగా జరుగుతుంది అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడం మరింత సులభం అవుతుంది అని ఎందుకంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు అత్యంత సన్నిహితులుగా ఉన్నారు అని సంపత్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యేగా సంపత్ కుమార్ ఓడిపోయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేరే నియోజకవర్గానికి ఇవ్వడం నిధులు ఇస్తున్న సంగతి మనందరికీ తెలిసిందే. అంతేకాకుండా ఒకవేళ ప్రజలు మాయ మాటలు డబ్బు కుల మత ప్రలోభాలకు లోబడి వేరే పార్టీలకు ఓటు వేసినట్లయితే ఐజ పట్టణ అభివృద్ధిని దూరం చేసుకున్న వారు అవుతారని మరియు రాష్ట్రంలో అధికారంలో లేని పార్టీ ఎక్కడి నుంచి డబ్బులు తెచ్చి అభివృద్ధి చేస్తాయని ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలని ప్రజలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండలానికి చెందిన ముఖ్య నాయకులు వివిధ హోదాలో ఉన్న చైర్మన్ వైస్ చైర్మన్ మాజీ చైర్మన్ మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు మిగతా అన్ని రకాల రాజకీయ పదవులు ఉన్న నాయకులు మాజీ తాజా నాయకులు సర్పంచులు కాంగ్రెస్ కార్యకర్తలు శ్రేణులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.












## ఎమ్మెల్యే చొరవ...లయన్స్ క్లబ్ నుంచి రూ.1.30 లక్షల సహాయం

- **ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు...గోల్డ్ మెడలిస్ట్‌కు సహాయం**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 9(ప్రజాస్వరం):**

పెట్ బషీరాబాద్ లో మైక్రోబయాలజీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించిన పేద విద్యార్థి శ్రీపతి ఉదయ్ కుమార్‌కు ఆస్ట్రేలియాలోని ఆర్ఎమ్ఐటీ (RMIT) యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం లభించింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడడంతో, బి.ఆర్.ఎస్.ఎల్.పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద ని విద్యార్థి ఆర్థిక సహాయం కోసం ఆశ్రయించారు. విద్యార్థి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సిఫారసుకు స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం రూ.1,30,000 ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద మాట్లాడుతూ, తాను సిఫారసు చేసిన మూడు రోజులలోనే విద్యార్థికి అండగా నిలిచేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని, అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాగే పేద విద్యార్థులకు సహకారం అందించాలని లయన్స్ క్లబ్ సభ్యులను కోరారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు తన వంతుగా ఎల్లప్పుడూ ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్, ముదిరాజ్ శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.











# అక్రమ నీటి వ్యాపారం నడుస్తోంది... రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు?

- **కుత్బుల్లాపూర్‌లో భూగర్భ జలాల దోపిడీపై పెరుగుతున్న ప్రశ్నలు**
- **బోరు బావుల నీటిని వాణిజ్య అవసరాల కోసం....జోరుగా అక్రమ నీటి వ్యాపారం**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 9(ప్రజాస్వరం):**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం పరిధి మహాదేవపురం షిరిడి హిల్స్ పరికిచెరువు సమీపంలో ప్లాట్ నెంబర్ 151 ప్రక్కన ఇంటి లో ఇంటి అవసరాల పేరుతో తవ్వుకున్న బోరు బావుల నుంచి భూగర్భ జలాలను బహిరంగంగా విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న వ్యవహారం కుత్బుల్లాపూర్ మండలంలో ఆందోళన కలిగిస్తోంది. నీటిని ట్యాంకర్ల ద్వారా విచ్చలవిడిగా అమ్ముకుంటున్నా, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తీవ్రమవుతున్నాయి. బోరు బావుల నీటిని వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్టవిరుద్ధమన్న విషయం అధికారులకు తెలియదా? లేక తెలిసినా మౌనంగా ఉన్నారా? ప్రజల కళ్లముందే భూగర్భ జలాల దోపిడీ కొనసాగుతుండగా, క్షేత్రస్థాయిలో తనిఖీలు, నోటీసులు, సీజ్ చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లోనే అక్రమ నీటి వ్యాపారం సాగుతుండటం పాలన వైఫల్యానికి నిదర్శనంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాల పరిరక్షణ బాధ్యత ఎవరిది?




చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితమైపోయాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, నీటి వనరుల శాఖలు స్పందించి అక్రమ నీటి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, రేపటి తాగునీటి భద్రతకే ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## 12వ వార్డులో బిజెపి అభ్యర్థి శంకర్ గౌడ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 09(ప్రజా-స్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ లోని 12వ వార్డులో బిజెపి అభ్యర్థి శంకర్ గౌడ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎండాల లక్ష్మీనారాయణ పైసా ప్రజలను కోరడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేరని వాళ్ళ మోసపూరిత హామీలను ప్రజలు నమోవొద్దని ఒక్కసారి బాన్సువాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో నిలుచున్న17 బిజెపి అభ్యర్థులను గెలిపించుకొని మున్సిపాలిటీని బిజెపికి అప్పగిస్తే. కేంద్ర ప్రభుత్వం నుండి అదనంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసి చూపిస్తామని ఒక్కసారి బిజెపి అవకాశం ఇవ్వాలని అన్నారు బిఆర్ఎస్ కాంగ్రెస్ వాళ్లు చేసిన అవినీతిలను ప్రజలకు తెలియజేస్తామని ఆయన అన్నారు కావున బాన్సువాడ మున్సిపాలిటీలో నిలుచున్న బిజెపి అభ్యర్థులను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నాను. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ భూమేష్ రేణుక ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు



# రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కే ప్రజాదరణ.





- **వనపర్తిలో భారీ ర్యాలీ.**

**వనపర్తి,ఫిబ్రవరి 9 (ప్రజాస్వరం):**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా సోమవారం వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 33 వార్డుల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి వేలాది మంది ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు, మాజీ మంత్రి సాంబని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, డీసీసీ అధ్యక్షులు శివసేనరెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రూ.5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సుల కొనుగోలు, డీజిల్ బంకులు, క్యాంటీన్ల ఏర్పాటు, పాఠశాల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారానే ఏకరూప దుస్తుల తయారీ వంటి కార్యక్రమాలు మహిళా అభ్యున్నతికి దోహదపడుతున్నాయని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, సబ్సిడీపై స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు, కల్టివేటర్లు, రోటవేటర్లు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ పరికరాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు రావాల్సిన అనేక రాయితీలను రద్దు చేసి కేవలం రైతుబంధు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, నూతన ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మిస్‌చార్జీలు, కాస్మెటిక్ చార్జీల పెంపు వంటి చర్యలతో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇండ్ల పండుగ కొనసాగుతోందని, గత పదేళ్లలో ఒక్క గ్రామంలో కూడా ఒక్క ఇల్లు ఇవ్వని పాలనకు భిన్నంగా, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అర్హుడికి ఇల్లు మంజూరు చేస్తోందన్నారు. రేషన్ కార్డుల విషయంలోనూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తూ మూడు పూటలా అన్నం పెట్టే పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. రాబోయే మూడు సంవత్సరాలు మాత్రమే కాదు, ఆపై మరో ఐదేళ్లు కలిపి మొత్తం ఎనిమిదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, భావోద్వేగ మాటలు నమ్మి ఇతర పార్టీలకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరిచిన ప్రతి కౌన్సిలర్ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిస్తే, పెబ్బేరు పట్టణ అభివృద్ధికి రూ.24 కోట్ల నిధులు తీసుకువచ్చి ప్రతి గల్లీని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పెబ్బేరు మున్సిపాలిటీని రెవెన్యూ డివిజన్‌గా మార్చడమే కాకుండా, ఆసియా ఖండంలోనే పేరుగాంచిన పెబ్బేరు సంతను తిరిగి పూర్వవైభవానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 33 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువకులు, మహిళలు,భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999